క్లుప్తంగా

నాసిరకం పనులపై విచారణ



సిరికొండ: మండలంలోని న్యావనంది చౌరస్తా వద్ద దేవాదాయ శాఖ నిధులతో నిర్మించిన రామాలయంలో నాసిరకం పనులపై శాఖ డీఈ ఓంప్రకాష్ గురువారం విచారణ చేపట్టారు. ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ ద్వారా రూ. 45 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా అడుగు బాగంలో అరుగు ఏర్పాటు చేయగా కుంగిపోయి మార్బుల్స్ పగిలిపోయాయి. గర్భాలయానికి తలుపులు బిగించలేదు. దీంతో ఆలయంలో జరిగిన నాసిరకం పనులపై గ్రామస్తులు ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పనులను డీఈ పరిశీలించారు. ధ్వంసమైన ఫ్లోరింగ్‌ను తొలగించి మరమ్మతులు చేయిస్తామని డీఈ తెలిపారు.

బీజేపీ శ్రేణుల ప్రచారం



సిరికొండ: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం బీజేపీ శ్రేణులు పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాల వద్దకు వెళ్లి వారు కేంద్ర పథకాల గురించి కూలీలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు తాళ్ల శ్రీనివాస్, శ్రావణ్‌రెడ్డి, గోపాల్, మారుతి, అజయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఇందల్వాయి: ప్రజలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ సిబ్బంది సూచించారు. అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారం పలు గ్రామాల్లో కొనసాగాయి. ఈసందర్భంగా గన్నారం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది డిచ్‌పల్లిలోని శివం ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు అగ్ని ప్రమాదాలు, నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ గోడౌన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగదారులకు ఇవ్వాల్సిన సూచనలను వివరించారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఉన్నారు.

స్మారక స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్ ఎదురుగా గురువారం విప్లవోద్యమ నేత, కార్మిక యోధుడు, అమరుడు డీవీ కృష్ణ స్మారక స్థూపం నిర్మాణం కోసం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీవీ కృష్ణ ఆదర్శ కమ్యూనిస్టు, అరుదైన విప్లవోద్యమ నాయకుడని కొనియాడారు. ఆయన ద్వితీయ వర్ధంతి జూన్ 26న స్థూపం ఆవిష్కరణ ఉంటుందన్నారు. నాయకులు ప్రభాకర్, నరేందర్, దేవారం, రాజేశ్వర్, సాయగౌడ్, సుధాకర్, సంధ్యారాణి, సాయిబాబా, సాయరెడ్డి, చరణ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి ప్రత్యేక పూజలు



సిరికొండ: మండల కేంద్రంలోని శేషసాయి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు యజ్ఞం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తుడు దువ్వూరి లింగారెడ్డి అన్నసత్రం కోసం ఆలయ కమిటీకి రూ.10వేలను విరాళంగా అందజేశారు. సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, గంగాధర్, నిరంజన్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి లీకేజీల గండం

- వేసవిలో వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ముబారక్‌నగర్‌కు వెళ్లే రోడ్డుపై వృథాగా పోతున్న నీరు

కార్పొరేషన్ రిపోర్ట్

నిజామాబాద్‌నాగారం: ఎండలు మండిపోతున్నాయి.. సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. ఈక్రమంలో వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్యలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సైతం కేటాయించింది. కానీ పైప్‌లైన్ లీకేజీల కారణంగా నగరంలో తాగునీరు వృథాగా రోడ్లపై పారుతోంది. మరమ్మతులు చేయకపోవడంతో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

మరమ్మతులు కరువు..

నగరంలో ప్రధాన రహదారులపై లీకేజీ సమస్య అధికంగా ఉంది. ప్రధాన రహదారుల మీదుగా వచ్చే పైపులైన్‌లపై లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. కంఠేశ్వర్, ముబారక్‌నగర్, అర్సపల్లి, గాంధీచౌక్ తదితర ప్రాంతాల్లో పైపులైన్‌లకు లీకేజీలు ఏర్పడ్డాయి. గతకొన్ని రోజులుగా లీకేజీలతో రోడ్డుపైనే మంచినీరు పారుతుంది. లీకేజీలు ఏర్పడినా కనీస పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆదేశాలు వచ్చినా..

నగరంలో ఎక్కడ కూడా నీటి సమస్య రాకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పైపులైన్ లీకేజీలు ఉన్నా, నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నా వెంటనే పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశాలు వచ్చాయి. ఈక్రమంలో ప్రధాన రహదారులు, గల్లీలో ఇలా ఎక్కడైనా సరే లీకేజీలు ఏర్పడితే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి వెనువెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడి రోజులు, నెలలు గడుస్తున్నా ఆవైపు అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో ప్రతినిత్యం నీరు వృథాగా పోతుంది. అసలే ఎండకాలం, ఇలాంటి సమయంలో నీటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.



కంఠేశ్వర్ వద్ద లీకేజీ అవుతున్న పైప్‌లైన్

లీకేజీలను అరికట్టాలి

నగరంలో ఉన్న పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలి. లీకేజీల వల్ల తాగునీరు వృథాగా పోతుంది. వేసవి దృష్ట్యా నీటి ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మున్సిపల్ అధికారులు పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి,నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి. –కృష్ణ, నగరవాసి

బీజేపీలో పలువురి చేరిక



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మఠంల శేఖర్, వందల మంది కార్యకర్తలు, అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. నగరంలోని ఎంపీ ధర్మపురి అర్వింద్ కార్యాలయంలో గురువారం వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి, ఎంపీ అర్వింద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని, ఎంపీ ఎన్నికల్లో బాగా పనిచేసి, నా గెలుపునకు సహకారం అందించాలన్నారు. మఠంల శేఖర్ మాట్లాడుతూ.. నాడు బీఎస్పీ తరఫున ఎమ్మెల్యేగా పోటీలో నిలిచానని, నేడు ప్రధాని మోదీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరానన్నారు. నాయకులు కానుల మోహన్, గల్ఫ్ కార్మికుల ప్రెసిడెంట్ గన్నారం ధర్మేందర్ కార్యదర్శి గోవర్ధన్, ప్రవీణ్, రవి, అజయ్, మహేందర్, శ్రావణ్, మహేష్, ధర్మేందర్, గంగాధర్, సుమన్, గంట మోహన్, మఠంల నాగరాజు, రాజేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద పటిష్ట బందోబస్తు



కలెక్టరేట్ వద్ద బందోబస్తు వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి ఐపీఎస్, ట్రెయినీ ఐపీఎస్ అధికారులు

నగరంలోని కలెక్టరేట్ వద్ద పోలీసు సిబ్బంది పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఈక్రమంలో భద్రత సిబ్బంది కలెక్టరేట్ వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



కలెక్టరేట్ వద్ద ఐడీ కార్డులను చూసి లోపలికి పంపుతున్న పోలీసులు

వాతావరణంలో మార్పులు.. రైతుల్లో ఆందోళన





రూరల్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా పెడుతున్న హమాలీలు.. ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

- ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలని డిమాండ్

నిజామాబాద్ రూరల్: రాష్ట్రంలో ఏర్పడ్డ వాతావరణ మార్పులతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగాళఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి కారణంగా రాష్ట్రంలో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ఇప్పటికే పేర్కొన్నారు. దీంతో ధాన్యంను విక్రయించడానికి వేచి ఉన్న రైతుల్లో కలవరం మొదలైంది.

ఉదయం ఎండ.. రాత్రి వాన..

గత కొన్ని రోజులుగా ఉదయం ఎండ తీవ్రత ఎక్కువ ఉండి, సాయంత్రం, రాత్రివేళల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో అరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోతుంది. ఈక్రమంలో సహకార సంఘాల్లో విక్రయించడానికి ఉంచిన ధాన్యం కుప్పలను త్వరితగతిన కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. దాదాపు పంట కోసి పదిహేను రోజులైన సహకార సంఘాల పరిధిలో కాంటాలు కాకపోవడంపై అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. జిల్లాలో మొత్తం 390 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ వరి ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.



ధాన్యం కుప్పలపై టార్పాలిన్లను కప్పుతున్న రైతులు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయించాలి. అలాగే ఆర్ఎన్ఆర్ రకానికి మంచి ధర పలుకుతుంది. దళారులు కడ్తా లేకుండా ధాన్యంను తీసుకొని సకాలంలో డబ్బులు వేశారు. రాబోయే వానాకాల సీజన్‌లో డిమాండ్ ఉన్న పంటలను వేసి రైతులు లాభాల బాటపట్టాలి.

–అంబట్ల రాజేశ్వర్, రైతు, ధర్మారం

ప్రధాని మోదీని ప్రజలు విశ్వసిస్తున్నారు

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలో బీజేపీ శ్రేణుల ప్రచారం



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: ప్రస్తుతం దేశంలో ప్రజలు బీజేపీ, ప్రధాని మోదీని విశ్వసిస్తున్నారని, తప్పకుండ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధిస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో పార్టీ శ్రేణులు గురువారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధన్‌పాల్ హాజరై, కరపత్రాలను పంపిణీ చేస్తూ, కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో ఒక్క అవినీతి మచ్చ లేకుండా ఒక్క బాంబు దాడులు లేకుండా పరిపాలిస్తున్న మోదీకే మా ఓటు అని ప్రజలు చెప్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాయమాటలు నమ్మేపరిస్థితిలో ప్రజలు లేరన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు ప్రవీణ్, పవన్, పగడాల సాయి, మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	76,400	వెండి (కిలో)	88,000
22 క్యారెట్స్	70,485	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	35	60	పచ్చిమిర్చి	50	70
బీరకాయ	45	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	35	60
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	35	60	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	45	60
పుదీనా	35	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: మార్కెట్ మహాలక్ష్మీ(తెలుగు)-10.50; టిల్లు స్క్వేర్(తెలుగు)-1.45, 7.30; మంజుమ్మల్ బాయ్స్(తెలుగు)-4.35,10.30
- స్క్రీన్-2: పారిజాత పర్వం(తెలుగు)-1.30; ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)-4.30,10.30; లవ్ యు శంకర్(హిందీ)-7.40
- స్క్రీన్-3: హ్యాపీడేస్(తెలుగు)-10.30 ,4.30, 10.30- టెనెంట్(తెలుగు) -1.40; మంజుమ్మల్ బాయ్స్(తెలుగు)-7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)-1.10,7.25; టిల్లు స్క్వేర్(తెలుగు)-4.30 ,10.25
- స్క్రీన్-2: గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ-తెలుగు)-1.40; (మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)-4.20, 10.35; బడే మియా చోటే మియా(3డీహిందీ)-7.15
- స్క్రీన్-3: తెప్ప సముద్రం(తెలుగు)-1.40; పారిజాత పర్వం(తెలుగు)-4.35; గీతాంజలి మళ్ళీ వచ్చింది(తెలుగు)-7.30; మార్కెట్ మహాలక్ష్మీ(తెలుగు)-10.35
- స్క్రీన్ -4: హ్యాపీడేస్(తెలుగు)-1.30; లవ్ యు శంకర్(హిందీ)-4.50; టెనెంట్(తెలుగు)-7.30; మైదాన్(హిందీ)- 9.50

- దేవి: టిల్లు స్క్వేర్ (తెలుగు)
- నటరాజ్: హ్యాపీడేస్(తెలుగు)
- లలితామహల్: ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
- విజయ్: గీతాంజలి మళ్ళీ వచ్చింది(తెలుగు)

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పెర్కిట్(ఆర్మూర్): రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడ దెబ్బ సోకకుండా జాగ్రత్త పడాలని గోవింద్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస సూచించారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ వరి కల్లాల్లో పని చేస్తున్న రైతులకు గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ.. వడదెబ్బ సోకినపుడు తక్షణ వైద్య సహాయం అందజేయాలని సూచించారు. శరీరంలో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే అధికమైనపుడు వడదెబ్బకు గురైనట్లు నిర్ధారించుకోవాలన్నారు. శరీరం నుంచి చెమట రూపంలో నీరు వెళ్లడం వల్ల డీహైడ్రేషన్‌కు గురవుతారన్నారు. తిరిగి శక్తిని పొందడానికి ఓఆర్ఎస్ తాగాలని సూచించారు. మధ్యాహ్నం పూట అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే కాటన్ వస్త్రాలను ధరించి బయటకు రావాలన్నారు. ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, సిబ్బంది లక్ష్మణ్, కల్పన, తరంగిణి పాల్గొన్నారు.

సమాచారం..

■ నేటి నుంచి నగరంలో విద్యుత్ అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్‌నగర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో నేటి నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ టౌన్-1 చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు చేపట్టనుండటంతో శుక్రవారం ఉదయం 9గం.ల నుంచి మధ్యాహ్నం 11గం.ల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. అలాగే శనివారం ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం 1గం. వరకు, ఆదివారం ఉదయం 9గం.ల నుంచి మధ్యాహ్నం 1గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

■ నేడు కోటగిరిలో ఉచిత మెగా వైద్య శిబిరం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ అధ్యక్ష కార్యదర్శులు హనుమంతరావ్ పటేల్, కప్ప సంతోష్ , మాజీ అధ్యక్షులు టి. రవి కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని చావడిగల్లి చావిడి వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని వివరించారు.

సంక్షిప్తం

అన్నదాతలకు సన్మానం



నిజామాబాద్ సిటీ: నగరంలోని బ్రహ్మపురి(గాజుల్‌పేట్) పెద్ద రాంమందిరంలో శ్రీ రామ నవమి ఉత్సవాలు పురస్కరించుకుని అన్నదానం చేసిన దాతలను గురువారం ఇందూరు బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు సన్మానించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, పరిశీలకులు కమల, మఠం ఫిట్‌పర్సన్ ఈవో వేణు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, బ్రాహ్మణ సేవాసంఘ సభ్యులు అజయ్ సంగ్వాయ్, జగదీశ్ కులకర్ణి, అనంత్ వైరాగర్, బ్రహ్మపురి స్థానికులు, మఠం బజరంగ్, మధు, సురేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

పూలే విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం




నిజామాబాద్‌నాగారం: నగరంలోని హనుమాన్ జంక్షన్‌లో గురువారం సావిత్రిబాయి పూలే విగ్రహ నిర్మాణ పనులను బీసీ సంక్షేమ సంఘం నాయకులు నరాల సుధాకర్ ప్రారంభించారు. నాయకులు దర్శనం దేవేందర్, కరిపే రవీందర్, వినోద్ కుమార్, శంకర్, శ్రీలత, లక్ష్మణ్‌గౌడ్, చంద్రమోహన్, గోపాలకృష్ణ, కోడూరు స్వామి, బాలన్న, రవి, మోహన్, రాజు పాల్గొన్నారు

నేటినుంచి సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఇందల్వాయి: మండలంలోని స్టేషన్‌తండాలో నేటినుంచి సేవాలాల్ మహారాజ్, రామారావు మహారాజు విగ్రహావిష్కరణతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు గురువారం ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ మోహన్‌నాయక్, జగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు అభినందన



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో ఇటీవల వేదిక్ మ్యాథ్స్ వివిధ విభాగాల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈసందర్భంగా సదరు విద్యార్థులకు గురువారం సిరికొండ ట్రాన్స్‌కో ఏఈ దాసరి చంద్రశేఖర్ మెడల్స్‌ను అందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పల్లితండాలోనే జీపీ భవనం నిర్మించాలి



సిరికొండ: గ్రామ పంచాయతీకి మంజూరైన భవనాన్ని మా తండాలోనే నిర్మించాలని సర్పల్లితండా వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు నిజామా బాద్ సిరికొండ ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో చేపట్టారు. మండలంలోని సర్పల్లి తాండ పరిధిలో వడ్డెర కాలనీ కూడా ఉంది. సర్పల్లితండా జీపీగా ఏర్పడినప్పటి నుంచి వడ్డెర కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో జీపీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల జీపీ భవనం కోసం నిధులు మంజూరుకాగా.. వడ్డెర కాలనీలో కాంట్రాక్టర్ ఇటీవల పనులు ప్రారంభించారు. దీంతో తండావాసులు గ్రామ పంచాయతీ పేరు సర్పల్లితండా కాబట్టి సొంత భవనాన్ని తండాలోనే నిర్మించాలని డిమాండ్ చే శారు. రాస్తారోకో చేపట్టిన గ్రామస్తులతో ఎస్సై రమేష్, ఏఎస్సై బాల్‌సింగ్ అక్కడికి వెళ్లి మాట్లాడా రు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిరసనలు తెలపవద్దని తండావాసులకు పోలీసులు సూచించారు. దీంతో వారు రాస్తారోకో విరమించారు.